# అమ్మ దగ్గరకు

"జీవన ప్రభాత్"

రాధిక ఆరుసంవత్సరాల బాలిక. ఆమె చక్కని నయనాలు ఎందరినో ఆకర్షించేవి. అందరూ తళతళ మంటూవున్న ఆమె చిరునవ్వుముఖాన ముద్దులవర్షాలు కురిపించేవారు. ... రాధిక నెరగనివా రెవరూ ఆ గ్రామంలో లేరు. తోడిపిల్లలతో ఎల్లప్పుడూ ఆడుతూ కనపడేది—రాధిక.

రాధికకు తల్లీ దండ్రీ లేరు. పసిపిల్లగా నున్నప్పుడే వారు చనిపోయేరు. ఆ చంటిపిల్లను పెంచుటకు అమ్మమ్మ మాత్రమే బ్రతికివున్నది. అమ్మమ్మనే 'అమ్మా' అని పిలుస్తూ తల్లి లేనికొరత తీర్చుకుంటోంది రాధిక.

ఆవీధిలోనివన్నీ పూరిళ్లు. అసలు ఆగ్రామంలో ఉన్న పెంకుటిండ్లు అన్నీ మూడు. బ్రాహ్మణవీధి కల్లా కరణంగారి ఇల్లొకటే గొప్పది — పెంకుటిల్లు కాబట్టి! ఆప్రక్కవీధిలో మిగిలిన పెద్దకులాలవారున్నారు. బ్రాహ్మణవీధికి చివరనే పాఠశాల వున్నది. దానికి ఎదురుగనే పంతులుగారు నివసిస్తున్నారు.

రాధికను బడిలోనికి వెళ్లమని రోజూ అమ్మమ్మ పోరుతూనే వుండేది. కాని, ఆ బాలికకు ఆటలమీద నున్నదృష్టి బడిమీద నున్నట్లే కనపడదు. ఒక్కొక్క రోజు అమ్మమ్మపోరు పడలేక కళ్లనీళ్లు జీరాడగా, కాళ్లు తడబాటుతో వెనుకకు నెట్టుతూవుండగా తిరిగి తిరిగి అమ్మమ్మనీ, ఆపూరింటినీ జాలిచూపుల చూస్తూ, బడియాత్రకు బయలుదేరేది. అటువంటి సమయాలలో అమ్మమ్మమనస్సు చివుక్కుమనేది — ఆవిధంగా ఏడుస్తూ బడికిపోయే బాలికకు చదువువస్తుందా? అసలు చదువుమీదకు దృష్టి వెడుతుందా? చంటిపిల్లలకు ఉత్సాహంపుట్టి తమంతతాము చదువుకుంటేనే చదువబ్బుతుందికాని--బలవంతంచేస్తే...ఎంతకని? ఈసంగతులన్నీ అమ్మమ్మకు తెలుసు. కాని ఏంచేస్తుంది? పిల్లకు ఏదోవిధంగా నాల్గుముక్కలు వంటబడితే బాగుపడుతుందనీ—ఏదోగుడ్డిలో మెల్లలాగ తమలాంటి బీదవారికి ...కొంచెం మంచిసంబంధం వస్తుందనీ--ఆమె యాశ!

రాధిక బడికి వెళ్లేది. అంతే — పంతులుగారు వచ్చేవరకూ అందరుపిల్లలమాదిరిగనే గంతులు వేసేది. మొదటి రోజుల్లో బడిగదిలోనికి వెళ్లిన దగ్గరనుంచీ పిల్లి మాదిరి కూర్చొనేది, అదొకవిధమైన భయంచేత. కాని రానురాను, ఆమెకు బడిపస పూర్తిగా తెలిసింది. అందరికంటె ఎక్కువగానే అల్లరిచేసేది.

పంతులుగారు రావడమే తరవాయిగా అందరూ బల్లో పుస్తకమో చేత బట్టుకొనేవారు. రాధిక దృష్టిమాత్రము ఇంటివైపు మరలేది. కళ్లు తెరచేవుండేవి, కాళ్లమీద పలక వుండేది, కళ్లు 'అ ఆ'లను చూస్తూనే వుండేవి... కాని—ఆమెతలలో ఇల్లు కనపడేది—అమ్మమ్మా, తడిబట్టలతో నీళ్లుతేవడమూ, మడి గట్టుకోవడమూ, అన్నంవండడమూ — మొదలయిన దినచర్య యావత్తూ విపులంగా కనపడేది. అందరు పిల్లలకంటే ఎక్కువ వినయంగా, భయభక్తులతోనే కూర్చొనేది-కాని, ఆమెమనస్సు విశ్వవిహారం చేసేది.

పంతులుగారు "అక్షరాలు దిద్దు" అని గద్దించి పలికినప్పుడు ఆమె ఉలిక్కిపడి, కళ్లనీళ్లు చిమ్మగా, కాళ్లు సర్దుకొని కూర్చుని, బలపము తిన్నగా పట్టుకొనేది. ఆమె ఇంకనూ అక్షరాలు దిద్దడము లేదని తెలుసుకొని, పంతులుగారామె ప్రక్కను కూర్చుంటే ఆమె భయంతో కొంచెం కళ్లెత్తి చూసి, గజగజ వణకుతూ అక్షరాలు తప్పగా దిద్దేది.

పంతులుగారు శాంతంతో ఆమెను బుజ్జగిస్తూ, "అమ్మాయీ! అలా కాదమ్మా-ఇలాగ", అంటూ

ఆమెచెయ్యి పట్టుకొని దిద్దించేవారు. ఆమె దిద్దేది. ఆయన లేచేవారు. "ఈమాటు సరిగ్గా దిద్దూ" అని గట్టిగా అనేవారు.

ఆమె కళ్లనీళ్లు తుడుచుకొంటూ, ఊపిరి యెగపీలుస్తూ, తలవూపుతూ, కళ్లల్లో పడుతూన్న ముంగురులను సరితీసుకొంటూ, బెదురుగా ఆయనముఖం చూసేది. ఆమెనయనాల తళుకుందనాలు పంతులుగారిని ఆకర్షించేవి. ఆయన దగ్గరకు వచ్చి ప్రేమతో ఆమె తల నిమురుతూ "బుద్ధిగా చదువుకో-చిట్టితల్లీ" అనేవారు.

ఒకరోజున పంతులుగారు గట్టిగా కోపించారు. ఆమె ఏడ్వసాగింది. "అమ్మ కావాలి-వెళ్లిపోతా" నని మారాం పెట్టింది. ఇంక నామెతో వేగలేక వేరొక బాలిక నామెకు తోడిచ్చి ఇంటికి సాగనంపారు పంతులుగారు.

ఆమె సులువుగా నేడ్వగలదనేవిషయం పంతులుగారు త్వరగానే తెలుసుకున్నారు. నాటినుండీ ఆమెను యథేచ్ఛగా ఆడుకోననిచ్చేవారు.

పేరుకుమాత్రమే రాధిక బడికి వెళ్లేది — కాని యెప్పుడూ ఆడుకొంటూనేవుండేది! ఆమెకు బూడిద అంటే మహాయిష్టము. ఎల్లకాలమూ బూడిదలో మునిగి తేలుతూవుండేది. శరీరమంతా బూడిద పులుముకుని, బైరాగిని అనుకరిస్తూ ఇంటికి తిరిగివచ్చేది.-రోజూ! ఈబూడిదపూసు కోవడంమూలాన అమ్మమకు రెట్టింపుపని కలిగేది.

"ఈబూడిద లేకుండానేనా చేశాడా – దిక్కుమాలిన దేవుడు!" అనేది పాపం! అమ్మమ్మ.

* * *

రాధిక మేనత్త తన యిద్దరుపిల్లలతోటీ ముసలమ్మను చూచిపోదామని వచ్చింది. బంధువులు వచ్చేరన్న సంతోషంతో ఆరోజుకు బడికి వెళ్లలేదు రాధిక. అమ్మమ్మ వెళ్లమననూలేదు—ఆ మరునాడు కూడా బడిముఖం చూడలేదు.

బడికి వెళ్లకపోవడం మూలాన ఆమెకు పెద్ద ప్రతిబంధకం తీరినట్లు తోచింది. బడిలోకంటె ఇంట్లోనూ, ఇంట్లోకంటె వీధి దుమ్ములోనూ ఆమె కెక్కువ స్వేచ్ఛ కనపడింది.

రాధిక స్వేచ్ఛాపిపాసిని. స్వేచ్ఛాపిపాసులందరూ విప్లవనాయకులై లోకాన్నంతటినీ తమ మార్గంలోనికి త్రిప్పేవిధంగానే రాధికకూడా తన మార్గంలోనికి తన మేనత్త బిడ్డల నిద్దరినీ త్రిప్పింది. త్రికాలాలూ దుమ్ములో మునిగి తేలుతూవుండేవారు. ఇప్పుడు త్రిమూర్తు లయ్యేరు. రాధిక మేనత్త సత్యవతమ్మ-ఎంతో కినిసింది. తనపిల్లలకు దుమ్ములో నాటలు ఇదివరకు రావన్నది. ఈపాడుపిల్ల రాధికవల్లనే నేర్చుకొన్నా రన్నది—ఆ దెప్పిపొడుపుమాటలకి అమ్మమ్మకి 'ఉడుకుబోతు తనం' వచ్చింది. "పిల్ల లయింతర్వాత దుమ్ములో ఆడకుండా వుంటారా?" అని సణిగింది.

"ఏమో నమ్మా! మాపిల్లల కిలాంటి పాడుఆటలు తెలియనే తెలియవు" అని సత్యవతమ్మ జవాబు.

ఆమాటలకు జవాబు చెప్పలేకపోయింది అమ్మమ్మ. ఆకోపం రాధికమీద చూపింది. ఆమెరెండు బుగ్గలూ గట్టిగా నులిమింది. "పాడుముండా!—నీ మూలాన అప్రతిష్ఠకూడాను!" అని విసుక్కుంది. రాధిక యేడుస్తోంటే మిగిలిన యిద్దరుపిల్లలకూ భయం వేసింది. ఏమీ యెరగనట్లు పిల్లుల్లాగ తల్లి ప్రక్క జేరేరు. ఆ మరుక్షణంలోనే అమ్మమ్మ యింట్లోనికి వెళ్లింది. రాధిక వీధులోని కురుకింది!

అనవసరంగా ఆడుకుంటూన్న పిల్లను కొట్టినందుకు అమ్మమ్మ చాలా విచారించింది—కాని మళ్లీ రాధిక మిగిలిన పిల్లలతో దుమ్ములో కనపడసాగింది. ఈమాటు అమ్మమ్మ గట్టిగా కోప్పడింది...రాధిక కళ్లనీళ్లుకారడం, అమ్మమ్మ హృదయం నీరవడం ఒక్కసారి జరిగేయి. వేళ్లు గిల్లుకుంటూ, మూతిముడుచుకొని, విచారంతో క్రిందికి చూస్తూ, ఏమీ అనలేకపోయింది. రాధిక కంటినీరు ఆమె హృదయాన్ని కలచివేస్తుంది మరి! — అమ్మమ్మ, "ఇంకెప్పుడూ దుమ్ములో ఆడకూ—" అంది గద్గద స్వరంతో!

రాధిక తల వూపుతుంది. అమ్మమ్మ రాధికతలను ప్రేమతో నిమురుతూ — "ఎంచక్కా తల దువ్వ

కున్నావా మరి — తలంతా దుమ్మయిపోయింది. మళ్లీ దువ్వగలనా చెప్పు? ముసలిముండనీ! ఇంకెప్పుడూ ఇసికలో ఆడుకోకేం — బుద్ధిగా చదువుకో తల్లీ! మాసినగుడ్డలా వున్నావు తలంటు పొయ్యాలి...అల్లరి పిల్లంటారు, అందరూ...ఆనక జడవేస్తాలే—" అంటుంది పాపం!

ఆమె లోనికి వెడుతుంది. రాధిక ఇటూ అటూ చూసి, కళ్లు పరికిణీగుడ్డతో తుడుచుకొంటుంది. కళ్ల కాటుక బుగ్గలదాకా ప్రాకి పరికిణీమీద ముద్రలుగా పడుతుంది. కాటుకమరకలు చూసి అమ్మమ్మ తిడుతుందేమోనని భయపడుతుంది. కాని ఆభయం క్షణికం. రివ్వున వీధులోనికి పరుగెడుతుంది...

మేనత్తా పిల్లలూ వెళ్లిపోయేరు. కాని, రాధిక మాత్రం బడికి వెళ్లేనేలేదు...ఆమె మేనత్తను మరువనే లేదు, కాని బడినిమాత్రం ఇట్టే మరిచిపోయింది. మధ్యమధ్య అమ్మమ్మ జ్ఞాపకంచేస్తే "అల్లాగే"అని వూరుకోజొచ్చింది రాధిక.

ఆరోజున బడినుంచి కరణంగారికృష్ణ పంతులుగారు పంపగా రాధికకోసం వచ్చేడు. కృష్ణ రాధికకంటే మూడేళ్లు పెద్ద, నాల్గుక్లాసు లెక్కువ.

"ఏం కృష్ణా! ఇలాగ వచ్చేవేం?"

"చూడండి మీ అమ్మాయి అసలు బడికి రావడం లేదండీ — పంతులుగారు పంపించేరు — ఈడ్చుకు రమ్మన్నారు."

ఆ మాటలు వింటోన్న రాధికగుండె నీరయింది. కృష్ణముఖం చూచేసరికే బడీ, అక్కడిపిల్లలూ, ఆలోకం... అన్నీ కళ్లకి కనపడజొచ్చేయి! వెంటనే ఆమె కళ్లనీళ్లు తిరిగేయి. కృష్ణ — వేగంగా రమ్మని – గదమాయించి చూచేడు. వెళ్లమని చెపుదా మనుకున్న అమ్మమ్మనోట మాట లాగిపోయేయి!

"కృష్ణా! ఈవేళకి వెళ్లు. రేపటినుంచి వొస్తుందిలే. దాని మేనత్తావాళ్లూ వొచ్చేరు — అందు మూలాని రాలేదు — నేనే వెళ్లొద్దన్నాను — పంతులుగారితో చెప్పు నాయనా!" అని తప్పంతా తనమీదనే వేసుకుంది.

రాధికముఖం తేటపడింది...ఏదో పెద్దభారం తీరినట్లు భుజా లెగరవేసుకుంటూ వీధులోని కురికేడు కృష్ణ.

అమ్మమ్మ ఇటూ అటూ చూస్తోవుంటే, చేతులు గిర్రున త్రిప్పుకుంటూ తుర్రుమంది—రాధిక!

* * *

ఇంకో రెండురోజులు గడచేయి. కృష్ణ మళ్లీ రాధికకోసం వచ్చేడు. ఏవిధంగానైనా పిల్లను బడికి పంపాలని నిశ్చయించుకుంది అమ్మమ్మ. వెళ్లమని గదమాయించింది రాధికను. ఇంక ఏడ్చినా లాభం లేదనే సంగతి గ్రహించి పలక పుచ్చుకుంది రాధిక, దుఃఖంతో. బలపం కనపడలేదని, 'నే వెళ్ల'నంది.

"నీక్కావలసినన్ని బలపాలు– చిన్నవీ పెద్దవీ– నే నిస్తాను," అన్నాడు కృష్ణ.

చొక్కా కనపడలేదని వంక పెట్టి వెదకనారంభించింది. పాపం—అమ్మమ్మ మడిబట్ట వదలి వేరొక తడిబట్ట కట్టుకుని — చొక్కా తొడగజొచ్చింది... రాధిక ఏడుపుముఖం పెట్టి—

"అందరికీ ఎన్నో పుస్తకా లున్నాయిఁ— నాకు ఒక్కటీలేదుఁ—" అంటూ చిందులు ప్రారంభించింది.

"నీకు పేర్లు చదవడం వొచ్చింతర్వాత ఎన్నో పుస్తకాలు కొంటాన్లే. ఇవ్వాళకి వెళ్లు తల్లీ" అని బ్రతిమాలుకుంది అమ్మమ్మ.

"నే వెళ్లను. పుస్తకాలు కావాలి."

"మరి నువ్వు చదవలేవుకదా?"

"అందరూ చదవగలిగే తెచ్చుకొంటున్నారా? వాళ్లసుశీల 'అఆ'లు దిద్దుకుంటోంది–ఇన్ని పుస్తకాలు తెచ్చుకుంటుంది–ఁ–నాకు ఒక్క పుస్తకమూ లేదు..."

ఆమాటలకు కృష్ణ: "నీకు పుస్తకాలిస్తే బడికొస్తావూ?"

"ఆఁ—ఒస్తా" అని గొణిగింది.

"మానాన్నదగ్గిర ఎన్నో పుస్తకా లున్నాయి. నీకు కావలసినన్ని, మొయ్యగలిగినన్ని—రకరకాలు– ఇస్తాను బడికి రా."

ఆమెఏడుపు పోయింది...అన్నిపుస్తకాలే!—సంతోషంతో గెంతింది. ఆమెకళ్లు తళుక్కున మెరిసేయి.

"ఇప్పు డిస్తావా?"

"ఇప్పు డెలాగ? బడికివెళ్లకపోతే పంతులుగారు పెళ్లి చేస్తారు! అందాకా బళ్లోవున్న పుస్తకం ఓటిస్తాను. ఆతర్వాత ఇంటికొచ్చింతర్వాత కావలసినన్ని..."
అందుకు వప్పుకొని ప్రయాణమయింది రాధిక.
"కృష్ణా! రోజూ అమ్మాయిని బడికి తీసికెళ్లూ—?"

"ఓ—అలాగే—" అంటూ రాధిక చెయ్యి పట్టుకుని వీధిలోని కురికేడు కృష్ణ.

* * *

కరణంగారి పాతపుస్తకాలు,. ఎందుకూ పనికిరానివి కావలసినన్ని—రాధిక మొయ్యగలిగినన్నీ కృష్ణ యిచ్చేడు. వాటితో తృప్తిపడక ఇంకా కొన్ని ఏరి వేరే పెట్టింది రాధిక. అవి కృష్ణ పుచ్చుకొన్నాడు. ఇద్దరూ బయలుదేరేరు.

ఆపుస్తకాలు తీసుకువస్తూ వుంటే రాధిక సంతోషం ఏం చెప్పను? అంతచదువూ తనకే వచ్చేసినట్లు, అన్నివిద్యలూ తన కప్పుడే అబ్బినట్లు తలచసాగింది రాధిక...కృష్ణ ఆమెకు ప్రాణమిత్రుడయ్యేడు—మరి తన కన్ని పుస్తకాలిచ్చేడుకదా!

ఆపుస్తకాలు తనేం చేసుగుంటుందో? అసలు అవి తన కెంతవరకూ పనికి వస్తాయో—పాపం! ఆమె కేమీ తెలియదు; ఆమె కావిషయం అక్కర్లేదు—వట్టి అమాయకురాలు!

* * *

పిల్లలకు ముఖ్యంగా చదువువిషయంలో ఎవరో వొకరు తోడువుండాలి. అప్పుడే వారికి చదువుమీద దీక్ష కుదురుతుంది. రాధికకు చదువువిషయంలో కాకపోయినా బడికి వెళ్లడంవిషయంలో మాత్రం ఇప్పటికి దీక్ష కుదిరింది. రోజూ కృష్ణ వచ్చి ఆమెను బడికి తీసుకు వెడుతున్నాడు--బడినుండి తీసుకు వస్తున్నాడు.

ఇప్పుడు దుమ్ములో నాటలు తగ్గించింది రాధిక. బడినుండి వచ్చిన తర్వాత కృష్ణగారింటికి ఆడుకొనే అందుకు వెళ్లేది.

అమ్మాయి మునపటంతటి అల్లరిచిల్లరగా తిరగడం లేదని అమ్మమ్మ ఎంతో సంతోషించేది.

బడిలో మునుపటిమాదిరిగా రాధికకు ఆదరణ జరగడంలేదు. రోజూ పంతులుగారు మంగళహారతులిస్తూనేవున్నారు. ఆమెకంటే ఎంతో వెనకవచ్చిన పిల్లలందరూ ఎంతో ముందుకు వచ్చేరు. ఇంకా మన 'మొద్దమ్మాయి' 'కాఖా'లలోనే వుంది అనేవారు.

"నీకు 'అఆ'లు ఎలా వచ్చాయో అని ఆశ్చర్యంవేస్తోంది—మొద్దమ్మాయీ!" అన్నారు పంతులుగారు.

మరి ఆశ్చర్యంకాక? ఎప్పుడేనా అక్షరాలు దిద్ది తేకద!

పంతులుగారిమాట లందుకుని మిగిలినపిల్లలందరూ రాధికను వెక్కిరించసాగేరు. "మొద్దమ్మాయీ! మొద్దమ్మాయీ!" అని ఏపిల్లనోట్లో చూసినా—! రాధికకు సిగ్గువేసింది. ఉడుకుబోతుతనం ఆమె నావేశించింది. చిన్నబోయినముఖంతో, ఒంటరిగా ఇంటికి తిరిగివచ్చింది. వీధిపొడుగునా 'మొద్దమ్మాయి' అనే పదం ఆమెకర్ణాలకు తగులుతోనేవుంది.

కలకల లాడుతూవుండవలసిన రాధికముఖం కలకబారివుండడం అమ్మమ్మకు ఆశ్చర్యంకలిగించింది. పంతులుగారు కూకలేశారు కాబోలనుకుంది. ఆవిధంగానైనా కొంచెం భయమూ భక్తీ పంతులుగారివల్ల ప్రసాదింపబడితే చాలనుకుంది!

రాధిక పలకా బలపమూ పుచ్చుకుని వంటయింట్లో వున్న అమ్మమ్మ వద్దకు వచ్చింది. అమ్మమ్మ—లోన సంతోషం పొంగు—తోవున్నా—చూసీ చూడనట్లూరుకుంది.

"అమ్మా! కాఖాలు నేర్పవూ?" అని కుమిలిపోతూ అడిగింది రాధిక.

ఈమాటు అమ్మమ్మ క్రుంగిపోయింది...తనకు చదువురాదు. తన చిన్నటినాటికాలంలో ఇటువంటి

చదువులేమీ లేవు. చిన్నపిల్ల–ఎన్నడూ చదువుకోని పిల్ల–తన్ను చదువు చెప్పమంటోంది – ఎన్నడూ లేని శ్రద్ధతో బుద్ధిగా కూర్చుని చదువు చెప్ప మంటోంది– తను చెప్పలేకపోతోంది! తల్లికే చదువు వచ్చి, తనలాగ తీరుబడిగలదై వుంటే, చంటిపిల్లను ఏడిపిస్తూ బడికి పంపిస్తుందీ?...తా నాబాలిక కోర్కెలాగ తీరుస్తుంది?

రాధిక మళ్లీ అడిగింది.

అమ్మమ్మ తలెత్తిచూసింది. రాధికకళ్లల్లో నీళ్లు తాండవమాడుతున్నాయి; అమ్మమ్మకళ్లల్లో కూడా నీళ్లు తిరిగాయి!

"తల్లీ! నాకు చదువురాదమ్మా! కష్ణదగ్గిరి కెళ్లి దిద్దుకో—"

"నేనక్కడికెళ్లను...అంతా వెక్కిరిస్తారు—"

"...ఎవ్వళ్లూ వెక్కిరించరు - వెక్కిరిస్తే మళ్లీ వెక్కిరించు."

"నే నసలు అక్కడికి వెళ్లనే వెళ్లను—"

"పోనీ కృష్ణని ఇక్కడికి రమ్మను. నే రమ్మన మన్నానని చెప్పు."

రాధిక మరుమాటాడకుండా వెళ్లిపోయింది. ఆమె కృష్ణకోసం వెళ్లలేదు—అసలు కృష్ణని తలచుకొననేలేదు. బడిలో అందరితోపాటు కృష్ణకూడా తన్ను పరిహసించాడుకదూ......

రోజూ ఆటకు వచ్చే రాధిక ఆరోజు రాకపోయేసరికి కృష్ణకు ఏమీతోచలేదు. అతనిపాదాలు రాధిక కోసమై తీసుకుపోజొచ్చేయి. మామూలు ప్రకారం రాధిక ఎదురురాలేదు. అమ్మమ్మకనపడింది.

అమ్మమ్మ అతన్నిపిలిచి, "అమ్మాయి ఈవేళ ఏడుస్తోందేం?"

"బళ్లో అందరూ ఏడిపించేరు — మొద్దమ్మాయని పేరెట్టేరు."

"ఎందుకూ?"

"ఎందుకేవిటి? ఎప్పుడూ అక్షరాలు దిద్దనే దిద్దదు. వెనకపిల్లలందరూముందుకి వొచ్చారు—అంతా బాలశిక్ష చదువుతున్నారు—పంతులుగారు మొద్దమ్మాయని పేరెట్టేరు," అని కిలకిల నవ్వసాగాడు.

అమ్మమ్మకు సంగతంతా తెలిసింది.

"కృష్ణా! అమ్మాయికి కాఖాలు నేర్పు నాయనా... ఎలాగేనా — బతిమాలేనా ... ఎక్కడుందో వెతుకు తండ్రీ."

కృష్ణ రాధికదగ్గిరికి వెళ్లాడు.... అతికష్టంమీద అక్షరాలు దిద్దడానికి వప్పుకొంది రాధిక.

*     *     *

రాధికకు తగినశ్రద్ధ బాగాకుదిరింది. పట్టుదలతో చదువు కొనసాగింది. కృష్ణ అన్నీ చెప్పడం...ఆమెకు సహజంగా తెలివితేట లున్నాయి. అవి ఇన్నాళ్లూ సరైన విధంగా వినియోగపడలేదు.

ఆమెలోని మార్పు — పంతులుగారినీ, బడిపిల్లలనీ — అందరినీ ఆశ్చర్యంలో ముంచింది. ఆమె శ్రద్ధకూ, చురుకుదనానికీ వింతసరదా పడిపోయారు పంతులుగారు. వారంరోజులు మించకుండానే తోటి పిల్లలను మించిపోయింది రాధిక!

మొద్దమ్మాయి — ఆమె కాదు. ఇప్పుడు బడిపిల్లలందరూ మొద్దమ్మాయలు!

అమ్మమ్మ రాధికను చూసి నిజంగా గర్వపడుతుంది...తన ఊహలన్నీ ఆ చిట్టిపాపవలన ఎప్పటికైనా నెరవేరుతాయా అని ఆశతో తనజీవితంలోని ముందు రోజులను చూస్తుంది...

*     *     *

"ఎక్కడ బాబూ?"

"అదిగోనండి — బ్రాహ్మణ వీధిలోనండి—"

"నాన్నా! మనింటి దగ్గిరేనేమో!"

"బాబూ! మీయింటిదగ్గిర కాదండి — వీధి మధ్యలో అయివుంటుంది—"

"అయ్యో! నాన్నా! రాధిక-ఇల్లు-కాదు-కదా"

"అబ్బాయీ! పరిగెత్తకు — ఒస్తున్నా..."

"నువ్వు త్వరగా రా..."

కృష్ణ పరుగందుకున్నాడు. కరణం గబగబా నడక సాగించాడు. తండ్రిమాటలు కృష్ణ వినిపించుకోలేదు. ఇంతలో తండ్రికి చూపుమేర దాటిపోయాడు.

ఆకాశమంతా పొగలు క్రమ్ముకుపోయింది. మధ్య మధ్య గుప్పుమని ఎర్రని మంటలు చెట్లపైనుంచి ఎగురుతూ కనపడుతున్నాయి. ఫెళ ఫెళ ధ్వనులు— — పక్షులు హాహాకారాలతో వలస పోతున్నాయి... దారి వెంబడి ఇండ్లు కాలిపోతూన్న స్థలానికి వగుర్చుకొంటూ వందలు వందలు పోతున్నారు. తమ ఇళ్లకేంముప్పు వస్తుందో అని పనిపాటలు చేసుకొంటూ వున్న కూలీలు పిల్లల్ని వదలి ముందు జాగ్రత్తకై పోతున్నారు...

కృష్ణ — కళ్లు కనపడకపోతూన్నా— అడుగులు తడబడుతూన్నా — శ్వాసకష్టమవుతూన్నా— —మనస్సుతో ఎగిరి పరుగెడుతున్నాడు...

జనం!......మంటల నార్పేవారు కొందరు— నీళ్లందిచ్చేవారు కొందరు — లోపలినుంచి సామాను లాక్కొచ్చి ఈవల పారేసేవారు కొందరు ... అనేకులు వింతచూస్తూ నిలుచున్నవారే!...రాధిక ఇల్లు— ఇంకా రెండుమూడు ఇళ్లు—అగ్నిహోత్రుడికి ఆహుతి అవుతున్నాయి.

జనాన్ని త్రోసుకుని ప్రవేశించేడు కృష్ణ. అతని ఆతురత ఎక్కువ గాజొచ్చింది. రాధికగాని, అమ్మమ్మగాని ఎక్కడా కనపడరు. ఎవరో ముగ్గురు నలుగురు తెగించి ఇంట్లోనికి దూరారు...

జనం విరుచుకు పడిపోతున్నారు. ఒకరి మీద నొకరు — చిందులాడి పోతున్నారు. ఆ జనం క్రింద పడి నలిగిపోతూ ఏడుస్తూవుంది ఒక బాలిక...ఎల్లాగో తప్పించుకుని దూరంగాపోయి "అమ్మా" అని ఏడుస్తూ వుంది. కాని ఆ మహా గందరగోళంలో ఆ సన్నని ఏడ్పు వినేవా రెవరు...

కాని — ఎక్కడో మూకలో మధ్య మునిగి వున్న కృష్ణ చెవులకు "అమ్మా" అనేధ్వని వినపడింది. కంగారుతో ధ్వనికోసం వెదకజొచ్చాడు.

ఆఖరికి జనాన్ని వదలి ఈవల పడ్డాడు...ఏడ్పు వినపడుతూ వుంది...

కృష్ణని చూసేసరికి రాధికరేడ్పు మితిమీరిపోయింది. డెక్కుసంటూ — "అమ్మ — అమ్మకా — లిపో — తోంది ... మంటల్లో వుంధి --- అమ్మ — "

" మీ అమ్మని ఎవ్వరూ —? "

" లేదు — "

ఆ సమయానికే ఇందాకా ఇంట్లోనికి వెళ్లిన మనుష్యులు తెలివి తప్పిపడివున్న అమ్మమ్మని మోసుకు వచ్చేరు. ఆమె శరీరము కాల్పులకు గురి అయింది. అప్పుడే వచ్చిన కరణంగారు ఆమెస్థితిని చూచి, కొందరి మనుష్యుల సహాయ్యం మీద దగ్గర్లోనేవున్న పట్టణం ఆసుపత్రికి ఆమెను పంపించ నియోగించారు...

తల్లిని అనేకమార్లు పిలిచింది – తట్టి చూసింది – కాని ఎంతకూ మాట్లాడదు తల్లి — ఆమెమీద పడి పొర్లి పొర్లి ఏడ్వసాగింది రాధిక ...ఆమెను అమ్మమ్మ దగ్గరనుండి విడదీసే అందుకు చాలా కష్టపడవలసి వచ్చింది...

కరణంగారింటికి రాధికను తీసుకు పోయారు. ఆమె ఎంతకూ వూరుకోదు. కృష్ణప్రయత్నా లన్నీ నిష్ఫలమయ్యాయి. ఆఖరికి నీరసంచేత శోషవచ్చి— నిద్రపోయింది...

*     *     *

ఆ రాత్రి రాధికకు తీవ్రజ్వరం వచ్చింది. కృష్ణ ఆమెచెంతనే కాచుకు కూర్చున్నాడు. రాత్రి తెల్లవార్లూ అమ్మమ్మకోసం పలవరిస్తూనే వున్నది.

ఆ మరునాడు మునపటికంటే ఎక్కువ జ్వరం వచ్చింది. కరణంగారూ, ఆయనభార్యా ఎంతో భయపడజొచ్చేరు...

"మా అమ్మేదీ — వొచ్చిందీ? " అని అత్యాతురతతో రాధిక ప్రశ్నించింది

"రాధా! మీ అమ్మ వొస్తుందమ్మా" అన్నాడు కృష్ణ.

రాధిక కొంచెం తెలివితో ప్రశ్నించింది, "అమ్మకి ఎలా వుంది?"

"చాలావరకూ తగ్గింది. ఇంకా స్నేపటికి వొస్తుందిట"

మళ్లీ ఆమెకు స్మృతి తప్పింది —

"అమ్మకావాలి — అమ్మదగ్గిరికి తీసికెళ్లండి నన్ను — ఊఁ — తీసికెళ్ల మంటే! ...... అమ్మ కావాలంటే ..."

మధ్యాహ్నం మూడు గంటలయింది. పట్టణం నుంచి మనిషి వచ్చి "అమ్మమ్మ" మరణవార్త చెప్పాడు. ఈ విషయంమాత్రం రాధిక చెవిని పడకుండా తగిన యేర్పాటులు చేశారు.

చీకటిపడింది. కృష్ణ ఈ రెండు రోజుల నుంచీ తిండి కూడా తినడంలేదు, రాధిక పక్కనే వుంటున్నాడు.

"మా అమ్మేదీ?" వెర్రిగా కేకేసింది.

ఆమె లేచి నిలబడకుండా దగ్గరున్న వారు పట్టుకొన్నారు.

వెర్రిగా చూస్తూ, "అమ్మ కావాలి— అమ్మ దగ్గిరికి పోతాను..."

ఆమె వెనక్కువాలింది ఏదో మెల్లగా అనబోచ్చింది. కృష్ణ ఆమె మీదకు వాలాడు. రాధిక కళ్లుమూసుకుంది. ఆమెపెదిమలు కదులుతున్నాయి— "అమ్మదగ్గిరికి — "

---


చిరకాలమునుండి బాధించుచున్న మూత్ర వ్యాధులకును శగ (గనేరియా) వ్యాధికిని క్రొత్తగా కనిపెట్టబడిన దివ్యౌషధము

గోనోకిల్లర్ (రిజిస్టర్డు)

ఇంగ్లీషుమందుల దేశీయఔషధములను పుచ్చుకొనినను గుణము కలుగనియెడలను, యింజక్షనులవలనను వాక్సినులవలననుగూడ లాభము లేకపోయినయెడలను, కపటిప్రయత్నముగా మా గోనోకిల్లనుగూడ పుచ్చుకొని చూడుడు. పెక్కు యేండ్లనుండియున్నను లేక క్రొత్తగా కలిగినను ఏరకము శగ సంకటమైనను మరెట్టి మూత్రవ్యాధులనైనను స్త్రీలకైనను పురుషులకైనను గోనోకిల్లరు తప్పక కుదుర్చును. మూత్రము జారీగా వెడలును. మూత్రము పోవుచున్నపుడు కలుగు మంట తగ్గిపోవును. మూత్రనాళమునందలి వాపు తీసిపోవును, సగవ్యాధి (గోనోకొకసు)వలన మూత్రము బొట్లుగాపడుట, మేహరోగమువలన మూత్రద్వారము నుండిపోవు తెలుపు, మూత్రద్వారముయొక్క వాపు మూత్రద్వారముయొక్క చుట్టువుండు పొరయొక్క వాపు, మూత్రాశయముయొక్క వాపు లేక మూత్రతిత్తియొక్క వాపు, వరములజబ్బు, మున్నగువ్యాధులన్నియును స్త్రీలకును పురుషులకును గూడ గోనోకిల్లరువలన కుదురును. వీర్యము (సెమను) పోవుట, మూత్రవ్యాధులు మున్నగునవిగూడ దీనివలన కుదురును. ఖరీదు 50 మాత్రలుగల సీసా రు. 3-0-0. కృత్రిమములు చూచి భ్రమ జెందవలదు. మా పుంజుమార్కు గమనింపుడు. వీ. పి. చార్జీ ప్రత్యేకము.

కృత్రిమములు చూచి మోసపోకుడు. మందును ఖరీదు చేయునప్పుడు ప్యాకెటుపై గోనోకిల్లర్ పేరున్ను, 'కోడి' మార్కు సీలునుగమనింపుడు.

అడ్రసు:—డాక్టరు డి. యన్. జస్సాని, గిర్‌గాను వెనుక రోడ్డు, బొంబాయి 4.

**Dr. D. N. JASANI, Girgaon Back Road, Bombay 4.**

*Madras Agents*:—DADHA & Co., 52, Nainippa Naick St., P. T. Madras.